

విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ 2వ షోరూం ప్రారంభోత్సవంలో సినీనటి వైష్ణవి చైతన్య, విశిష్ట సీఈఓ సింధుజా, చైర్మన్ పలభట్ల ఆనంద్‌బాబు

విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ షోరూం ప్రారంభం



విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ 2వ షోరూం ప్రారంభోత్సవంలో ఆభరణాలను ప్రదర్శిస్తున్న సినీనటి వైష్ణవి చైతన్య

ఎల్బీనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సమీపంలోని అష్టలక్ష్మీ కమాన్ పక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ 2వ షోరూంను ప్రముఖ హీరోయిన్ వైష్ణవి చైతన్య ఆదివారం ప్రారంభించారు. తమ అభిమాన నటిని చూసేందుకు వచ్చిన అభిమానులతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వ్యాపారమైనా వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనాలన్నారు. అప్పుడు వ్యాపారం వృద్ధి సాధిస్తుందన్నారు. చైర్మన్ పలభట్ల ఆనంద్‌బాబు మాట్లాడుతూ నాణ్యత, మన్నికతో కూడిన బంగారు ఆభరణాలకు విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం నిలయమన్నారు. కార్యక్రమంలో విశిష్ట సీఈఓ సింధుజా, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, కాచం సత్యనారాయణగుప్తా, ఎల్వీకుమార్, బాలరాజుగుప్తా, మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా, రుషి, కాచం సుష్మ తదితరులు పాల్గొన్నారు.



షిరిడీనగర్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

షిరిడీనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

హయత్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని షిరిడీనగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆదివారం పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పార్కును అభివృద్ధి చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. అందుకు కార్పొరేటర్ స్పందిస్తు త్వరలో జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి పార్కును అభివృద్ధి చేస్తామని అన్నారు. రోడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరుతామని అన్నారు. దశలవారీగా శివారుకాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన అన్ని కాలనీలకు మౌలిక సదుపాయాల్లో భాగంగా తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, పార్కులు, వీధి దీపాలను ఏర్పాటు చేయించడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సంఘం మహాసభలను విజయవంతం చేద్దాం

- జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్. ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా రైతు సంఘం 30వ మహాసభలను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి పిలుపునిచ్చారు. తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో ఈనెల 15, 16, 17వ తేదీల్లో ఈ సభలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా నుంచి రైతు సంఘం నాయకులు పెద్దఎత్తున తరలి వచ్చి మహాసభలకు హాజరు కావాలని కోరారు. రైతు సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఈ సభలు జరుగనున్నాయన్నారు.



మానస ఎన్‌క్లేవ్‌లో ఔట్‌డోర్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఔట్‌డోర్ జిమ్ ప్రారంభం

కొత్తపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వ్యాయామం కోసం ఔట్‌డోర్ జిమ్ అందరికీ అందుబాటులోకి తెచ్చామని, జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మానస ఎన్‌క్లేవ్‌లో ఔట్‌డోర్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యాయామం కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని నివసించే చోటే ఔట్‌డోర్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జహీర్ ఖాన్, ప్రతినిధులు వెంకటరామయ్య, నవీన్, వెంకటేశ్వర్లు, అంజని, దుర్గ, లక్ష్మి, నాయకులు మంచి రాజేష్, జంగారెడ్డి, సుందర్‌నారాయణ, కొత్త తిరుమల్, రాకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వృత్తి సంఘాల రాష్ట్ర నాయకుడు యాదయ్య

ప్రజలను విస్మరిస్తున్న పాలకవర్గాలు

- వృత్తి సంఘాల రాష్ట్ర నాయకుడు యాదయ్య

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజలను పాలకవర్గాలు విస్మరిస్తున్నాయని వృత్తి సంఘాల రాష్ట్ర నాయకుడు యాదయ్య అన్నారు. ఎల్బీనగర్‌లో జరుగుతున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ జిల్లా తరగతులకు యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మతోన్మాదాన్ని ఎదుర్కొవడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టిన పాలకవర్గాన్ని ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సంవత్సరానికి మూడుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం ఏకంగా లేబర్ చట్టాలనే రద్దుచేయడం సహించరానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ చట్టాలను రద్దుచేసిన కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికులకు మేలు చేస్తుందని దుయ్యబట్టారు. దేశంలో అసంఘటిత రంగ కార్మికులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, కవిత, ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, రుద్రకుమార్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



నాగోల్ జైపూర్‌కాలనీ నువ్వులబండలోని బంగారు మైసమ్మ తల్లి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ దంపతులు - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

- బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విగ్రహశుద్ధి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు రాణిరుద్రమలు మాట్లాడుతూ బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి, సాయంత్రం దీపాలతో అలంకరించి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, నాయకులు బండారి భాస్కర్, హరీశ్‌రెడ్డి, కిరణ్‌కుమార్, నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి శుద్ధి కార్యక్రమంలో బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి, నాయకురాలు రాణిరుద్రమ

ఎన్‌టీఆర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహశుద్ధి

ఎల్బీనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని పార్టీ నాయకులు శుద్ధిచేశారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి వందల సార్లు సవరణలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఈ రోజు రాజ్యాంగాన్ని కాపాడాలని రోడ్డెక్కడం హాస్యాస్పదమన్నారు. అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెస్ పార్టీ నేతలే అని వారన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు బీజేపీ శ్రేణులు కట్టుబడి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు రాములుయాదవ్, సంతోష్, వెంకట్‌రెడ్డి, సతీష్, కరుణ, కుసుమ, షకీరా, శ్రీను, శేఖర్‌రెడ్డి, మహేష్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహ శుద్ధి కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి తదితరులు

అర్హులకందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు : భాగ్యలక్ష్మి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని బస్తీల్లో నివాసముంటున్న అర్హులైన నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందడం లేదని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి విమర్శించారు. ఆదివారం బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా పార్టీ రాష్ట్ర అధిష్ఠానం పిలుపు మేరకు మూసారాంబాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ నాయకుడు ఎస్.కుమార్, రాష్ట్ర నాయకుడు కొప్పు భాషా, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ జి.సుభాష్‌చందర్జీ, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌పటేల్‌తో కలిసి శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డివిజన్‌లో బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని సంజీవయ్యనగర్, బ్యాండ్ బస్తీల్లో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సంజీవయ్యనగర్, బ్యాండ్ బస్తీలో అర్హులైన నిరుపేద కుటుంబాలు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, వితంతు, వృద్ధాప్య పింఛన్లకు, ఒంటరి మహిళ పథకాలకు అర్హులున్నా ఇంతవరకు అందడం లేదని కార్పొరేటర్ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహ, యాదగిరి సురేందర్, ప్రవీణ్, రాంచందర్ పాల్గొన్నారు.



మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధీకరణ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి తదితరులు

రేషన్ షాపుల్లో సన్న బియ్యం చారిత్రాత్మక నిర్ణయం

- ఒక్క గింజా పక్కదారి పట్టడం లేదు
- టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా, మాజీ మేయర్ చిగిరింత
- మల్లాపూర్‌లో లబ్ధిదారు ఇంట్లో సహపంక్తి భోజనం



సన్నబియ్యం లబ్ధిదారు విజయమ్మ ఇంట్లో భోజనం చేస్తున్న చల్లా నర్సింహారెడ్డి, పారిజాతారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ నిర్ణయం తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయమని, ఈ పథకం ప్రవేశపెట్టిన పటి నుంచి ఒక్క బియ్యం గింజ కూడా పక్కదారి పట్టకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లలోకే వెళ్తోందని టఫ్‌ఐడీసీ(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ తీరును వారు పరిశీలించారు. అనంతరం స్థానిక లబ్ధిదారు బల్గూరి విజయమ్మ ఇంట్లో సన్నబియ్యంతో చేసిన భోజనం ఆరగించారు. అనంతరం చల్లా, చిగిరింత మాట్లాడుతూ గతంలో దొడ్డుబియ్యం తీసుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపేవారు కాదని, ఒకవేళ తీసుకున్నా సదరు బియ్యం ఇతరులకు విక్రయించేవారని అన్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న సన్నబియ్యం ప్రతి లబ్ధిదారుడు తన ఇంటికే తీసుకెళ్తున్నాడని, ఒక్క గింజ కూడా విక్రయించడంలేదని అన్నారు. సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో చేసిన బువ్వ తినే అదృష్టం తెలంగాణలోని రేషన్‌కార్డుదారులకు దక్కిందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ పథకాలు పేదలకు చేరుతున్నాయని, అన్ని వర్గాలవారూ ప్రస్తుతం సంతోషంగా ఉన్నారని వారన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ ఖల్సా రైతుసంఘం వైస్ చైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి, కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, బాలాపూర్ మండల కమిటీ అధ్యక్షుడు పర్వతి రవికాంత్‌రెడ్డి, పి.మౌనికారెడ్డి, సాయిముదిరాజ్, సుధాకర్‌రెడ్డి, గిరిముదిరాజ్, రంజిత్, ప్రవీణ్ పాల్గొన్నారు.



మూసారాంబాగ్‌లోని అండాళ్ నిలయం నిర్వాహకురాలు రూపాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిందాకృప చలివేంద్రాన్ని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. ఎస్ఐ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



ఏఐటీయూసీ జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకుడు రాములుగౌడ్ తదితరులు

ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి : రాములుగౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్ అన్నారు. తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్‌లోని ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న శంషాబాద్‌లో నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భూతరాజు నర్సింహ, వెంకటసోమయ్య, శ్రీను, రాములు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల మనిషి శ్రీపాదరావు

- బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు



దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు తదితరులు

కొత్తపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ప్రజల మనిషి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు అని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు కొనియాడారు. ఆదివారం కొత్తపేట మోహన్‌నగర్‌లో దుద్దిల్ల శ్రీపాదరావు 26వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీపాదరావు గ్రామ సర్పంచిగా, కోఆపరేటివ్ జిల్లా చైర్మన్‌గా సమితి అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, శాసనసభ స్పీకర్‌గా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. శ్రీపాదరావు కుమారుడు ప్రస్తుత రాష్ట్ర ఐటీ అండ్ అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రిగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర ప్రగతికి పాటుబడుతున్నారన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, కోశాధికారి మంత్రి సునీల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి బాలచందర్‌శర్మ, ప్రతినిధులు గూడా రాజేశ్వర్‌రావు, దేవులపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు స్మృతివనం ఏర్పాటు చేయాలి

- కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్



కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్ తదితరులు

చంపాపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యంలో ప్రకృతిని సజీవంగా ఉంచి మొక్కలు నాటి ధన్యజీవుడైన వనజీవి(దరిపల్లి) రామయ్యకు అతని సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం స్మృతివనం ఏర్పాటు చేయాలని కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ కోరారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో గాయత్రీనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్‌రావు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ యూనివర్సిటీకి వనజీవి రామయ్య పేరును ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రామయ్య దేశ ప్రజలకు వృక్ష సంపదపై అవగాహన కల్పించిన ఆయనకు ఇంటి స్థలం కేటాయించి ఆర్థికంగా తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శంకరయ్య, ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి వీరయ్య, బాల్‌రాజ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్. ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన సుక్క సుమన్(22) మాదాపూర్‌లో టీ టైంలో పని చేస్తున్నాడు. శనివారం పనికి వెళ్లిన అతడు తిరిగి రాత్రి 10గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమన్‌కు అతడి చెల్లెలు రిషిత ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అయితే మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఆక్రమణలకు పాల్పడలేదు'

అబ్దులాపూర్‌మెట్ : మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని ఇందిరమ్మసాగర్, వేములకత్వ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని జీనియస్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధి తెలిపారు. సంస్థపై సీపీఎం చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. వారు చేసిన ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవాలే అన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించుకోవాల్సిన అవసరం తమ సంస్థకు లేదన్నారు. వాటి సమీపం వరకు ఉన్న పట్టా భూములకు సం బంధించి రెవెన్యూ అధికారులు ఇచ్చిన సర్వే మ్యాప్ ప్రకారమే హద్దులు ఏర్పాటు చేసుకుని భూమి చదును చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయం అర్థంకాక కొంతమంది కావాలనే తమ సంస్థకు చెడ్డపేరు వచ్చేవిధంగా అసత్య ఆరోపణలు చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

'జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి'

పంజాగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర చారిత్రాత్మకమైనదని, వారిని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి, వారు ఎదుర్కొంటున్న అన్నిరకాల సమస్యలను పరిష్కరించాలని వక్తలు, సీనియర్ జర్నలిస్టులు, తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్(టీజేఎఫ్), తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ(టీయూజేఏసీ)ల ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం జరిగింది. ఫ్రంట్ అధ్యక్షుడు మోహన్ బైరాగి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో రాష్ట్రంలోని 16 సంఘాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, డెస్క్, ఫోటో, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు. వివిధ అంశాలపై చర్చించి పలు తీర్మానాలను ప్రతిపాదించగా వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. జర్నలిస్టుల సంక్షేమ బోర్డు, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, కంట్రిబ్యూటర్, స్ట్రింగర్‌లకు గౌరవ వేతనం ఇవ్వాలని, రైల్వేపాస్‌ను వెంటనే పునరుద్ధరించాలని, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించాలని, టెలికాస్ట్ అవుతున్న చానల్ లో పనిచేసే ప్రతి జిల్లా, గ్రామ స్థాయి విలేకరికి, ప్రతీ వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్, హెల్త్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, సినీదర్శకుడు రఫీ, డాక్టర్ వెంకటేశ్వర్లు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, తెలంగాణ ఉద్యమకారులు కప్పర ప్రసాద్, ఇంద్రవెల్లి రమేష్, ఇస్మాయిల్, ముతేష్, గిరిరాజ్, ఆనంద్ రామస్వామి,వి.రవీందర్‌రెడ్డి, ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా, తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక ప్రతినిధులు ఎ.యాదగిరి, డోలక్ యాదగిరి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆట,పాట సభికులను ఆకట్టుకున్నాయి.

వైభవంగా వాయునందనుడి శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రలో మహిళలతో కలిసి పాల్గొన్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వాయునందనుడైన ఆంజనేయుడి విజయోత్సవంలో భాగంగా శనివారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 19వ డివిజన్‌లోని సాయినగర్, బడంగ్‌పేట్‌లోని మారుతీనగర్ కాలనీల్లో నిర్వహించిన శోభాయాత్రలో మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని ఆంజనేయుడికి పూజలుచేశారు. మహిళలతో కలిసి భజన చేసి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాముడి నమ్మినబంటు ఆంజనేయుడు స్నేహబంధానికి స్వచ్ఛమైన నిదర్శనంగా నిలిచాడని అన్నారు. కార్యక్రమాల్లో స్థానిక కాలనీల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

బర్కత్‌పుర : మద్యం మత్తులో 40 ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి కిందపడిపోవడంతో తలకు గాయాలై చనిపోయాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ స్టేషన్ రోడ్‌లోని మహారాష్ట్ర బ్యాంక్‌కు ఎదురుగా ఫుట్‌పాత్‌పై నుంచి గుర్తు తెలియని వ్యక్తి కిందపడిపోయాడు. మద్యం మత్తులో ఉండడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమర్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.